క్లుప్తంగా

ఆలయాల్లో జడ్జి ప్రత్యేక పూజలు



జడ్జి కుటుంబసభ్యులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

పామూరు: స్థానిక శ్రీవల్లీసమేత భుజంగేశ్వర స్వామి, మదన వేణుగోపాలస్వామి ఆలయాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కనిగిరి జడ్జి భరత్‌చంద్ర, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మహంకాళి శివప్రసాద్, జొన్నాబొట్ల సాయితేజలు జడ్జి, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేసి సన్మానించారు. ఎస్సై టి.కిషోర్‌బాబు, మాజీ ఎంపీటీసీ ఉప్పలపాటి హరిబాబు, గుత్తి కొండలరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం

మర్రిపూడి: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల మహిళ సమాఖ్యా సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఏపీఎం కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 జరిగే సమావేశానికి గ్రామసంఘం, పాలకవర్గ సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

2న మండల స్థాయి శిక్షణ

సీఎస్‌పురం(పామూరు): మండలస్థాయి పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ తరగతులు జనవరి 2న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్‌లు శిక్షణకు హాజరుకావాలన్నారు. పాఠశాల స్థాయిలో ఎస్ఎంసీ శిక్షణ తరగతులు జనవరి 4న నిర్వహిస్తామన్నారు.

4న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4న స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు తెలిపారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

వరమ్మ మృతికి సంతాపం

లింగసముద్రం: వైఎస్సార్ సీపీ మండల నాయకుడు, జేసీఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి సతీమణి వరమ్మ అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆదివారం తన స్వగ్రామమైన రాళ్లపాడు గ్రామంలో తుదిశ్వాస వదిలారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పచ్చపాటి తిరుపతిరెడ్డి, సర్పంచ్ మన్నేపల్లి బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన మధు, మద్దెల రవిలు వరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, బాక్సుల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు పేట్లు, బాక్సులు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): యూటీఎఫ్ నాయకులు ఇర్ల కొండయ్య, శైలజ దంపతులు విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇర్ల తిరుపాలయ్య, సాలమ్మల జ్ఞాపకార్థం ప్లేట్లు, బాక్సులు పంపిణీచేశారు. ఈసందర్భంగా సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లోని దివ్యాంగ విద్యార్థులకు, భవితభవన్‌లోని దివ్యాంగ విద్యార్థులకు భోజనప్లేట్లు, లంచ్‌బాక్సులు అందజేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించం

సీఎస్‌పురం(పామూరు): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం జెడ్పీహెచ్ఎస్, కోమటిగుంట్ల, చింతపూడి, నాగులవరం ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం నాగులవరం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం, ఇతర వసతులపై చర్చించి 6 నుండి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రధానమంత్రి పరీక్షా పే చర్చ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు చేయాలని సూచించారు. హెచ్ఎం కుమారి, కిరణ్‌కుమార్, రవీంద్ర ఉన్నారు.



పరీక్షా పే చర్చ కార్యక్రమ రిజిస్ట్రేషన్లపై వివరిస్తున్న ఎంఈఓ

రైతు కష్టం వర్షార్పణం



వెంకటాపురంలో వర్షం నీటిలో నిలిచి దెబ్బతిన్న శనగ



వెంకటాపురం వద్ద పూతరాలిపోయిన కందిపైరు

- వర్షాలకు మినుము, శనగ రైతులకు అపార నష్టం
- తుఫాన్‌తో కందిపూత నేలపాలు
- నాలుగు మండలాల్లో 2619 హెక్టార్ల పంటనష్టం



అనుమునిగిరి వద్ద దెబ్బతిన్న మినుము పంట

పామూరు: నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రూ.లక్షల్లో పెట్టిన పెట్టిబడి నీళ్ల పాలు కావడంతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. వర్షాలకు నియోజకవర్గంలోని పామూరు, కనిగిరి, పీసీపల్లి, సీఎస్‌పురం నాలుగు మండలాల్లో మొత్తం 2619 హెక్టార్లలో మినువు, వరి, అలసంద, శనగ, ఉలవ పంటలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా ఈ వర్షాలకు ముందుగా వచ్చిన ఫెంగల్ తుఫాన్ వల్ల మరికొన్ని హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. పామూరు మండలంలో మొక్కదశలో ఉన్న శనగ 350 ఎకరాల్లో దెబ్బతినగా వారికి మరలా విత్తనాలను 80 శాతం రాయితీపై అందజేశారు. ఇటీవల వర్షంతో దెబ్బతిన్న పంటలను జేడీఏ శ్రీనివాస వర్మ, ఏడీఏ వెంకటరమణ స్థానిక ఏఓలతో కలిసి పరిశీలించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పంట నష్టం వెంటనే రైతులకు అందించి ఆదుకున్నారు. ఉచితంగా పంటల బీమా, పెట్టుబడిసాయంతో రైతులకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు దాటినా అన్నదాత సుఖీభవ పథకం ఊసే ఎత్త లేదని రైతులు మండిపడుతున్నారు.

మినుము, శనగ రైతులకు అపార నష్టం

వర్షాలకు మినుము, శనగ పంటలు అధికంగా దెబ్బతిన్నాయి. కోటి ఆశలతో రబీలో సాగుచేసిన మినుము, శనగ పంటలపై రైతులు కోటి ఆశలు పెట్టుకోగా పంటలు మొదట్లో తెగుళ్లబాధతో కొంత పంటదిగుబడి తగ్గిపోతుందని బాధపడుతున్న తరుణంలో 25 రోజుల నాడు వచ్చిన ఫెంగల్‌తుఫాన్, వారం రోజులనాడు కురిసిన వర్షం ఉన్న పంటను కూడా నీటిపాలు చేయడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

తుఫాన్‌తో కందిపూత నేలపాలు

పూతదశలో ఉన్న కంది తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు అధికంగా దెబ్బతింది. ముఖ్యంగా పూతదశలో ఉన్న కంది పూత రాలిపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవు. కందికి మళ్లీ పూత వస్తుందా రాదా అనే ఆలోచనలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

2619 హెక్టార్ల పంటనష్టం

వర్షం కారణంగా అధికంగా మినుము పంట పామూరులో 635 హెక్టార్లలో, కనిగిరి 620, పీసీపల్లిలో 879, సీఎస్‌పురం 58, మొత్తం 2192 హెక్టార్లలో, వరి పామూరు 15, కనిగిరి 46, పీసీపల్లి 4, సీఎస్‌పురం 14 మొత్తం 79 హెక్టార్లలో, అలసంద పామూరు 9, కనిగిరి 162, పీసీపల్లి 33, సీఎస్‌పురం 21 మొత్తం 225 హెక్టార్లలో, శనగ సీఎస్‌పురం 78 హెక్టార్లలో, ఉలవలు పీసీపల్లిలో 45 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు తెలిపారు.

ప్రభుత్వానికి నివేదిక

ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో దెబ్బతిన్న మొత్తం 2619 హెక్టార్ల పంటనష్టంపై పటలవారిగా జిల్లా అధికారులకు నివేదికలు పంపాం. పంటనష్టం మంజూరైన వెంటనే రైతులకు అందేలాచూస్తాం.

– వెంకట రమణ, ఏడీఏ, కనిగిరి

ఎకరాకు క్వింటా వచ్చే పరిస్థితి లేదు



20 ఎకరాల్లో మినుము సాగు చేశా. సక్రమంగా పండకపోవడంతో ఎకరాకు నాలైగదు క్వింటాళ్లైనా వస్తుందనుకున్నాం. కానీ క్వింటా కూడా వచ్చే పరిస్థితి లేదు. శనగా మొక్క దశలోనే కుళ్లిపోయింది. సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పంటనష్టం, పెట్టుబడిసాయం ఇచ్చి ఆదుకోవాలి.

– వెలగపూడి వెంకట నారాయణ, రైతు, వెంకటాపురం

కందిపూత రాలిపోయింది



3 ఎకరాల్లో కంది వేశాను. మినుము, శనగ సాగుచేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు కందిపైరు పూత రాలిపోయింది. మొక్క దశలో ఉన్న శనగకూడా దెబ్బతింది. ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలి.

– మారంరెడ్డి కొండలరావు, రైతు, వెంకటాపురం

త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి



చట్టుమడుగులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమణారావు



నీలకంఠాపురంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని వట్లబైలులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వివిధ భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అధిక అర్జీలు ఆన్‌లైన్‌కోసం, సర్వేకోసం వస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు అర్జీతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతపరిచి ఇవ్వాలని, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండల సర్వేయర్ బ్రహ్మారెడ్డి, సర్పంచ్ దుద్దేల వెంగళరావు, ఎస్ చినమాలకొండయ్య, ఎండోమెంట్ అధికారులు శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని చుట్టుమడుగు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 21 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఆర్ఐ బి.మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, సర్పంచ్ బద్దిపూడి శారమ్మ, మార్కు, పీఎస్ నాగేశ్వరరావు, నాయకులు కేవీ రమణయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధి నీలకంఠాపురంలో గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో ,ఆన్‌లైన్లు చేయాలని 10, వివిధ సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. సర్వేయర్ రమణయ్య, వీఆర్వో పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

కందుకూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ద్వారా కేంద్ర మంత్రి పదవి పొందిన అమిత్‌షా నిండు సభలో అంబేడ్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం అంటే భారతజాతికి తీరని ద్రోహం చేసినట్టేనన్నారు. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ముప్పరాజు కోటయ్య, బూసి సురేష్‌బాబు, మోహన్‌రావు, గౌస్‌భాషా, ఆనందమోహన్, నత్తా రామారావు, దుర్గాప్రసాద్, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు, నరసయ్య, నాంచార్లు, రామ్మూర్తి, పవన్, వెంకటేశ్వర్లు, మాలకొండరాయుడు పాల్గొన్నారు.

గుడ్లూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం గుడ్లూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెంటనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, లేకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడం తప్ప అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించలేదన్నారు. ప్రజా సంఘాల నాయకులు గంగోలు మాల్యాద్రి, రమేష్, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య, దామా కృష్ణయ్య, కొమరగిరి అంజయ్య, ఎం.వెంకటేశ్వర్లు, పాలకుర్తి నాగేశ్వరరావు, బీరకాయల వెంకటేశ్వరరావు, రామచంద్రయ్య, ఏడుకొండలు, సీపీఎం శాఖ కార్యదర్శి గుత్తి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి, సయ్యద్ హసీన, సీపీఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, బాలిరెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కొండపి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ట్రైనింగ్ సెంటర్ స్కిల్ హబ్‌లో నిర్వహించే ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి ఆరో తేదీ నుంచి డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెన్స్ కోర్స్, టైలరింగ్ కోర్సులపై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 8897964505 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి



బంగారు బాల్యంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): జీవితం ఎంతో విలువైందని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రముఖ సైకాలజిస్టు డి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ బాలిక పాఠశాల, ఎంఎస్ఆర్ బఆలికల జూనియర్ కళాశాలలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంఈఓలు ఉడుముల నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, సీపీఐ ఖాజావలి, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్‌రెడ్డి, సీడీపీఓ సరోజిని, హెచ్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్డు పనుల పరిశీలన

కనిగిరిరూరల్ (హనుమంతునిపాడు): కనిగిరిలో జరుగుతున్న హైవే రోడ్డు పనులను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు నాణ్యత లోపం లేకుండా నిర్మించాలన్నారు. అనంతరం కనిగిరి చెరువులను పరిశీలించారు. చెరువు కింద అలుగులు ఆక్రమణకు గురిచేస్తే వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. చెరువులు ఆక్రమణలకు గురవకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్అండ్‌బీ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి



పోలీస్‌స్టేషన్ లోని రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని కొండపి సీఐ జి.సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌లోని రికార్డులు, కేసు డైరీలు, రిజిష్టర్లు పరిశీలించి రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా విచారించి కోర్టుకు పంపాలన్నారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని విచారణ నిష్పక్షపాతంగా చేసి న్యాయం జరిగేలా చూడాలన్నారు. మండలంలో గంజాయి, పేకాట గుట్కాపై ప్రత్యేక నిఘా పెట్టి ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రిళ్లు దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు

వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలి

- పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు వేణు



పశువైద్యశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు వేణు

మర్రిపూడి: పశువైద్యాధికారులు అందుబాటులో ఉండి పశువులకు వైద్యసేవలందించాలని పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకుడు పి.వేణు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పశువైద్యశాలను ఆయన సోమవారం పరిశీలించారు. 'మూగరోదన పట్టదా' అన్న శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక పశు వైద్యాధికారి బ్రహ్మయ్య జీవాలు నివశిస్తున్న దొడ్లల్లోకి వెళ్లి పలు జీవాలను పరిశీలించి వైద్యసేవలు అందించారు. జీవాలు చనిపోవడానికి కారణాలు, ఎలాంటి జబ్బు చేసింది, ప్రస్తుత పశువుల పరిస్థితి ఎలా ఉంది, తదితర విషయాలను పశుపోషకులను అడిగి తెలుసుకున్నారు. జీవాలకు సోకిన జబ్బును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యశాలలో సహాయ సంచాలకుడు వేణు సిబ్బందితో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పశుపోషకులకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాలకు ఇష్టానుసారంగా అలా వచ్చి ఇలా వెళితే కుదరదని సిబ్బందిపై మండిపడ్డారు. ఎక్కడైనా పశువులు, జీవాలకు బాగలేకపోతే సంఘటనా స్థలానికి చేరుకొని వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో వైద్యశాలలకు మందులు పంపిస్తామన్నారు.

మసూర 1638 రకంతో అధిక దిగుబడి



కె.బిట్రగుంటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): తెలంగాణ మసూర 1638 రకం సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని, తెగుళ్ల బెడద ఉండదని వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి తెలిపారు. కె.బిట్రగుంటలో తెలంగాణ మసూర 1638 రకం సాగు చేసిన వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు నాటిన 20 రోజుల్లోనే నారు నాటుకోవాలన్నారు. అప్పుడే పైరులో సమస్యలు రాకుండా నియంత్రించవచ్చన్నారు. అంతేకాక అగ్గితెగులు సోకదని పంట కాల పరిమితి 120 రోజులు ఉంటుందని దిగుబడి 30 నుంచి 35 బస్తాలు వస్తుందని వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలేఖ, గ్రామ వ్యవసాయ సహాయకులు రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరెడ్డి

హనుమంతునిపాడు: రోడ్డు విస్తరణలో గృహాన్ని తొలగిస్తుండటంతో నిలువ నీడ లేకుండా పోయిందని మనస్తాపానికి గురై సానికొమ్ము వెంకటరెడ్డి అనే వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. వివరాల్లోకి వెళితే.. హనుమంతునిపాడుకు చెందిన సానికొమ్ము వెంకటరెడ్డి సచివాలయం, ప్రభుత్వ ఆస్పత్రికి పరమడ వైపున రోడ్డు పక్కన రేకులు షెడ్ నిర్మించుకొని గత 25 ఏళ్ల నుంచి హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గృహాలు తొలగిస్తున్నారు. వారి ఇంటి వెనుక వైపున బ్రహ్మంగారి ఆలయం ఉంది. విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన మార్కింగ్ ఇచ్చి వెంటరెడ్డి ఇంటి రేకులు తొలగించారు. ఇంటికి వెనుక వైపున ఉన్న బ్రహ్మంగారి గుడి ఉంది. గుడి పక్కన ఉండానికి వీల్లేదు. గ్రామ వీఆర్‌ఓ పూర్తిగా ఇళ్లను తొలగించాలని సూచించారు. దీంతో నిలువ నీడ లేకుండా పోయిందని మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

విద్యార్థులకు మోడల్‌పేపర్లు పంపిణీ



మోడల్‌పేపర్లు పంపిణీచేస్తున్న దాతలు, యుటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతి విద్యార్థులకు యుటీఎఫ్ సమకూర్చి దాతల సాయంతో అందజేస్తున్న మోడల్‌పేపర్లు ఎంతో ఉపయోగకరమని జెడ్పీహెచ్ఎస్ అంబవరం హెచ్ఎం ఆర్.హనుమంతరావు, డీజీపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చాంద్‌బాషా అన్నారు. అంబవరం జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో దాత బత్తుల గంగాధర్ సమకూర్చిన మోడల్‌పేపర్లను 34 మంద విద్యార్థులకు, డీజీపేట జెడ్పీహెచ్ఎస్‌లోని 38 మంది విద్యార్థులకు దాత కటకం సత్యనారాయణ సమకూర్చిన మోడల్ పేపర్లను విద్యార్థులకు అందజేశారు. యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, జవంగుళ వెంకట్రావు, షేక్.చాంద్‌బాషా, జి.వేమనారాయణ, వి.సాంబశివరావు, పి.వీరయ్య, యస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తిదారులైన ప్లంబర్, బార్బర్, వాటర్ ప్యూరిఫైయర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గ్రీసర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మెషీన్ మరమ్మతులు, బ్యూటీషియన్‌లకు నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థలైన ఎన్ఎస్‌డీసీ, ఎస్‌డీసీ సంస్థల ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ కె.అనూష సోమవారం తెలిపారు. వీరిలో అర్హత ఉన్న వారికి హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌బోర్డు చేయించి జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు మెప్మా సీఎంఎం సంపత్‌కుమార్ 7901610225, సురత్న కుమారి 7901610233, మాధవీలత 7901610230 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాలనీలో వీధిలైట్లు వేయించాలి

సీఎస్‌పురం(పామూరు): పాములవారి కాలనీలో వీధిలైట్లు వేయించాలని సీపీఐ నాయకులు కోరారు. గత రెండు నెలలుగా వీధిదీపాలు వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం వీధిలైట్లు వేయించాలని కోరుతూ పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పొదల చాటున ప్రమాదం



అలకూరపడులో పొదలతో నిండి ఉన్న విద్యుత్ స్తంభం

టంగుటూరు: మండలంలోని అలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం పొదళ్లతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రజలు, చిన్న పిల్లలు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. ఈ విద్యుత్ స్తంభం చుట్టూ పొదళ్లతో ఉండటం వల్ల నిత్యం నిప్పు రవ్వలు, విద్యుత్తు షాకు రావటంతో స్థానిక ఉండే ప్రజలు, విద్యార్థులు ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులు తెలిపినా ఉపయోగం లేదు, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉండాలని కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com